# బ్రాహ్మణాగ్రహారం

"ఎవరు వారు!"

"నేను కొండుశ్రౌతిని, చయనులు బాబయ్యా?"

"ఆవును రా నాయనా! అంతా క్షేమమా?'

"నీఆశీర్వచనబలం. నువ్వు క్షేమంగా వచ్చావా?"

"జ్రిరున చీదలేదురా యీమాటు"

"చాలా దినాలకి వచ్చావు. ఫాల్గునంలో కాదూ—?"

"అవు నవును, పదిమాసా లయింది"

"వెళ్ళిన పని తృప్తిగా—"

"తృప్తన్న తృప్తా? కురిసిపోయాయిరా రూపాయలు. చెట్టు దులిపినట్టే. మహామంచి సంపాదన జరిగిందిరా యీమాటు"

"పునహా సతారాలు వెళ్ళి నువ్వెప్పుడు తక్కువ తెచ్చావు? కాని నిలవ మాత్రం చేశావు కావు"

"దాని సిగ్గోసిన నిలవ, డబ్బా ప్రధానం, దర్జా కానీ? కాకపోయినా, మనిషిని ధనం నిలవ చేస్తుందా, ధనాన్ని మనిషి నిలవ చేస్తాడా?"

"అదీ నిజమే బాబయ్యా"

"ఇంకేం మరీ?........ఎప్పుడు కావా లంటే అప్పుడే అవుతుంది సంపాదించే మొనగాడికి నిలవ. పిడికిలి గట్టిగా బిగిస్తే సరీ, వొక్క సంవత్సరం పాటు"

"తలుచుకుంటే నువ్వు నిమిషాలమీదే వేలు నిలవచేస్తావు"

"అవును గదా? .......కాని చివుకుల రామిగాణ్ణి మట్టం చేసే దాకా నిలవ చెయ్యడం మాట తీసెయ్యి నాదగ్గిర"

"నీపట్టుదల మహాచెడ్డది బాబయ్యా"

"కాకపోతే?....వాణ్ణిక బతకనిస్తానుట్రా నేను?"

"నీకు కోపం వస్తే అంతే"

"నేను దేశంలో లేను కదా అని కిలకిల్లాడుతున్నాడు కామోసునేం వాడు?"

"ఇంకేనా శాంతించవూ పెద్దబాబయ్యా?"

"శాంతించ మంటావా? శాంతించే పనే చేశాడా వాడు?"

"...................."

"నా అంతర మేం, తన అంతర మేం, నిండు సభలో తీసిపారేస్తాడా నన్ను?"

"...................."

"రెండో తాంబూలం యిప్పించడూ నాకు""

"నిజానికి వాడు తొందరేపడ్డాడు; కానీ—"

"ఇక కానీ యెందుకూ మరీ?....తోటపంపు తనఖా అయిపోయింది కదా కొంప వేలంవెయ్యడమే తరవాయి కదా? ఇక రంగసాని బాడవా? చూస్తూ వుండు, యీదెబ్బతో అది క్రియం రాయించకపోతే నారెండు చెవులూ తెగ్గొయ్యి"

"నువ్వు తలుచుకున్నా వంటే—నీతో విరోధం పెట్టుకున్న వాడి చెవులు తెగ్గొయ్యాలి, నీకేం?"

"తిండి కేనా సరిపోయే ధాన్యం రావుకదా, స్మార్తం ముక్కలే కాని, ఫలాయత మేనా పూర్తి కాలేదుగదా, నా మీద కక్షకదటాడా కుంక?"

"......................"

"నాతో విరోధపడ్డాకేనా వాడికి దిగతీత ప్రారంభం?"

"అవునవును"

"అజ్ఞానం వుండాలా అక్కర్లేదా? దీపంమీద పడ్డ శలభంలాగ మాడి పోవాలి గాని, నాతో పోరి—"

"ఇప్పటి కేనా వాడికి బుద్ధి రావలసింది"

"ఇంకా వాగుతున్నాడా యేమిటి?"

"వాడి మాటకి జమేమిటి పద్దేమిటి పోనిస్తు బాబయ్యా"

"అయినా—సంగ తేమిటో కాస్త చెబుదూ వారే"

"చెప్పే దేమిటి పదిమాట్లు? ఎవరికి తెలవం దేముందీ?"

"తిడుతున్నాడా?"

"......................"

"కవిత్వం అల్లుతున్నాడా?.... ఆమధ్య ఛందస్సు అఘోరించాడులే భట్రాజు దగ్గిర"

"వాడి మొఘం, కవిత్వమే?"

"మరేమిటి?"

"ఇక మూడో తాంబూలం కూడా నీకిప్పించ డుట"

"ఏమో?"

"మొదటి రెండు తాంబూలాలూ కర్మజ్యేష్ఠులికి వెడుతున్నాయి కనక, యిక మూడో తాంబూలం విద్యాధికుడికి వెళ్ళడం ధర్మముట"

"ఎవడుట ఆ విద్యాధికుడు?"

"సుందరప్పయాజులుగారుట"

"వాడి మొఘం. నన్ను కాదని సుందరప్పగాడు ముందుకి వస్తాడు కామోసు?"

"ఎన్నివేల గుండె లుండాలీ? ఆయన నీదగ్గిరే కాదూ క్రమం—"

"ఉర్లాంలో వాడికి పట్టా పుట్టింది, నాకు లేదు. అంతేనా?"

"వెడితే నీకు మాత్రం రాకపోవునా? నిన్ను పరీక్ష చెయ్యగల మొగాడెవడూ భూమ్మీద?"

"చాలా బింకంగానే వున్నాడన్న మాట"

"ఇంతకీ, కొండపెల్ల వెంకప్ప వాడితో కలిశాడు నువ్వు వెళ్ళిన నెల్లాళ్ళకి"

"హరోంహర, కలిశాడూ?"

"ఇద్దరూ వొక్క తాటిమీద నడుస్తున్నారు"

"జోగీ జోగీ రాసుకుంటే—"

"బూడిద రాలిందిట. మహా బాగా చెప్పావు"

"వెంకప్పగాడి పిలక మనచేతిలో వుంది యెరుగుదువా?"

"అదేమిటి?"

"వాడు బొడ్డు పెరుమాళ్ళు సెట్టికి యెనిమిది వందలికి నోటు రాశాడు"

"ఎరుగుదును పుష్కరాలకి ముందు కాదూ?"

"రెండేళ్ళు దాటింది. శెట్టి యెన్నిమాట్లడిగినా "యిదిగో" "అదిగో" అంటూ వచ్చాడు; కాని దమిడీ్మ వసూలుపెట్టలేదు"

"అయితే?"

"శెట్టి యిక ఆగడు"

"దావా—"

"సగం వడ్డీతో యిస్తే నోటు నాకు ట్రాన్సుఫరు చేస్తానన్నాడు శెట్టి"

"అయితేనూ.... బాబయ్యా!"

"ఆ"

"ఇప్పు దర్థం అయింది"

"ఏమిటో చెప్పు చూతాం"

"ఆమధ్య నువ్వు శెట్టికి తొమ్మిదివందల పైచిలుకు పంపావని వదంతి—"

"వదంతి కాదు నిజమేరా నాయనా"

"అయితే, శెట్టి దగ్గిర నువ్వెప్పుడేనా వాడుకున్నావేమో అనుకున్నాను. ఆ నోటు కొనేశా వన్నమాట"

"పెట్టిలో వుంది చూపించనా?"

"ఇవాళ పెట్టిలో వుంది, రేపు కోర్టులో వుంటుంది వేరే చూపించే దేమిటి?"

"ఇక చూసుకో నా ప్రతాపం"

"ఇది బ్రహ్మ కేనా తెలవదు సుమా బాబయ్యా"

"మనస్సులో వుంచుకో"

"తెలిస్తే మాత్రం బాదేమిటి కానీ— వెంకప్ప యేం చెయ్యగలడు కానీ.... అయినా నాకెందు క్కానీ— ఏతావతా జమ యేమాత్రం బాబయ్యా?"

"అంచనా కట్టు చూతాం"

"సహస్రం"

"ధా!"

"అంటే పెరుమాళ్ళు సెట్టికి పంపింది కాక"

"అయితే మాత్రం? అదేమంత భాగ్యం రా?"

"పోనీ, అది కాక రెండు"

"మరో రెండు కలుపుకో"

"అబ్బా!"

"మరే మనుకున్నావు?"

"అయితే, రామదీక్షితులూ వెంకప్పా చచ్చా రన్నమాటే"

"వెధవల్ని తిప్పితిప్పి కొడతాను చూస్తూ వుండు"

"మహా పకడ్బైన యెత్తు వేసుకొచ్చావు బాబయ్యా"

"అలా అన్నావు కదా నువ్వు?"

"అనక?"

"అయితే, నువ్వు నాలో వాడవేనా?"

"నాలోవాడవేనా అంటే—"

"ఏమిటి అంటే?"

"...................."

"అదేమిటో తేల్చరా వెర్రినాగులూ"

"నా సంసారం సంగతి నువ్వెరగంది కాదు. ఏ రోజున అర్ధ రూపాయ లేకపోతే—"

"ఏమంటావు?"

"నాదారిని నన్ను పోనియ్యి"

"పోనివ్వను. నువ్వు దివాన్గిరీ చక్కగా చేస్తావు. నువ్వు నావాడవయితే తక్కిన నాపనులు ఆగిపోవు"

"నేను పూనుకోడమే వస్తే ప్రాణం యిచ్చెయ్యవలసిందే. వె—ధ—వ కృత్రిమం నాచేత కాదు"

"అంచేతనే—వొక్క కాగితం యిచ్చేస్తాను పుచ్చుకో"

"................"

"ఏమంటావ్?"

"................"

"ఆలోచించుకో"

"................"

"ఎన్ని పెళ్ళిళ్ళూ వొడుగులూ చేయిస్తే వందరూపాయలు కిడతాయీ? నీకెన్ని ఆశ్రమా లుండినా యేడాది కెన్ని శుభకార్యాలు తగులుతాయీ పెద్దవీ?

"................"

"భయపడకు"

"కొడతారనీ తిడతారనీనా?"

"ఇంకేం?....పోనీ నేనేమేనా తక్కువ చెప్పానా?"

"తక్కువకీ యెక్కువకీ—"

"మూడుపుట్ల ధాన్యం రా"

"................"

"గాది బాగుచేయించుకో"

"అలా అన్నావా?"

"నీతపన అర్థం అయింది. నిన్ను చూస్తే జాలేస్తోంది. రొఖ్ఖం కూడా ముప్ఫయి రూపాయలు, ఏం?"

"సెబాస్!"

"అంతే అనుకోకు. యాభై చావులు అసమానమైనవి దొరికాయి, రెండు—రెండేమిటి, నాలు గిచ్చేస్తాను దర్జాగా కట్టుకో"

"....నీరుణం తీర్చుకోలేనయ్యా"

"నీకొడుక్కి కూడా బట్టలూ పుస్తకాలూ యిచ్చేస్తా నీయేటికి"

"పేరుపేరు వరసని యింటిల్లపాదికీ—"

"ఇక కోడలికి మాత్రం బంతిలో బాలపక్షం చెయ్యడం యెందుకూ? ఒక పునహాచీర దానిక్కూడా పట్టుకుపో"

"మాఅత్తారేనా యెప్పుడూ యిలా సంతోషపెట్టలేదు"

"ఏమంటావు మరీ?"

"ఇక తప్పతుందా?"

"ధీమాగా చెప్పావు కాదు"

"పనిచెయ్యాలా మాట చెప్పాలా ధీమాగా?"

"అయితే సరే. మధ్యాహ్నం కనపడతావు కాదూ?"

"రాలేను. రాయవరంలో నవగ్రహశాంతి వుంది, వెళ్ళాలి"

"ఏమాత్రం?"

'నామట్టుకి వొక తులం—"

"పోనియ్యకు"

"పున్నానికి బియ్యం అయిపోతాయంటోంది నీకోడలు"

"రేపే కొలిపించేస్తాను ధాన్యం కావాలంటే. రొక్కం అయితే—"

"వద్దువద్దు, ధాన్యం అయితే నీపేరుగా భూతతృప్తి"

"అలా వుండాలి విశ్వాసం. నీకేమిచ్చినా పాత్రదానమే అవుతుంది మరి సాయంత్రం?"

"తప్పకుండానూ"

"చూడూ, రాత్రి నువ్వూ, కోడలూ, మనమడూ కాస్త చారూ అన్నమూ పుచ్చుకుని కొత్తబట్టలు కట్టుకుని—"

"నీకు నూటొక్క సాష్టాంగనమస్కారాలు బాబయ్యా"

"శుభం నాయనా, శుభం"

"మరి వద"

"గప్‌చిప్"

"వేరే చెప్పాలా బాబయ్యా?"

"అయితే....వూళ్ళో వున్నట్టేనా?"

"ఆ, ఆః నిన్ననే వచ్చింది మేళం వెళ్ళి. దండిగానే లాక్కొచ్చిందిట యీమాటు. కోనసీమ దోచేసిందని చెప్పుకుంటున్నారు"

"అసాధ్యురాలు కాదూ?"

"నువ్వే కనక కుక్కని చేసేశావు దాన్ని"

"గ్రహించావు నువ్వు. అబ్బో!"

"నోరెత్తాటప్పటికీ రామదీక్షితులుగాణ్ణి విసిరికొట్టింది మరిచిపోతానా?"

"ఆ పరాభవం చాలదుట్రా వాడికీ? ఏదీ, నీలాచలాన్నలా నిలవగలిగాడా వాడూ? నేను కన్నుగీటానంటే కుక్క అయిపోదూ అదీ?"

"సత్తా మాట అలా వుండగా, నీచేతి కెముక లేదు కనక—"

"చూడూ....పారేసేచోట పారెయ్యాలి. ఒక్క మాసం తిరిగానంటే సానికి సంవత్సరం పోషణ"

"నీశక్తి అలాంటిదే....మరి పొద్దెక్కుతోంది, వెళ్ళాలి"

"పదపద....రాత్రి భోజనం మాట మరిచిపోకేం?"

"మరిచిపోవడమే?"

"పోనివ్వరా కుర్రావా, జట్కా, పెద్దవీధినే పోనియ్యి, కరణంగారి యింటిదగ్గిర మళ్ళించవచ్చు. చూడూ... ఊళ్ళోకి వెళ్ళాక గాలప్పరుగుమీద వెళ్ళాలి గుర్రం తెలిసిందా?"

## 2

"ఏమట్టుకి వచ్చిందిరా కథ?"

"ఏమట్టు కయితేం, నేనేమో తప్పకుండా నెగ్గేస్తాను; కాని మూడుదినాల కిందట వూరి కెళ్ళింది"

"ఏవూరూ?"

"రామేశ్వరం"

"ఛఛా, అదేమిటి?"

"అలా వచ్చింది"

"చక్రం అడ్డువడెయ్యలేకపోయావా?"

"కుదిరింది కాదు"

"అయితే, ముందుమాట?"

"అదే ఆలోచిస్తున్నాను"

"ఇదే అన్నమాటేమిటి, మరోటి చూసుకో"

"తీరా ఫలోన్ముఖం అయినాక యీస్వల్పకారణంవల్ల విడిచి పెట్టుకోనా? చేదా యేమిటి, మీరంతా వుండనే వున్నారు కదా మార్గదర్శకులు?"

"ఆవకవుల జాపితా కెక్కావు కదా నువ్వూ మాలాగే వుండాలా? అయినా, అంత యేమరిపాటుగా యెందుకున్నావూ?"

"ఏమరిపాటు కాదు, వ్యవహారం అంతా వడిదుడుగ్గా వచ్చేసింది"

"ఏమిటా వడిదుడుకు?"

"అసలు రామేశ్వరం యాత్ర హఠాత్తుగా—అంటే సూచన అయినా లేకుండా వచ్చింది. సోమిదేవి మేనత్త, తన కూతుర్ని తీసుకువెడుతూ దీన్ని కూడా పంపిస్తారేమో అని శనిలాగ వచ్చి కూచుంది. దాంతో, సోమిదేవి, యెంత మొత్తుకున్నా, భీమన్నశాస్త్రులు మామ వదవదమని వదగెంటేశాడు"

"ఇరవై యేళ్ళయినా నిండాయో లేదో అప్పుడే యీ పుట్టిమునక యేమిట్రా?"

"మన మతం వోట్టి వెధవమతం కాదుట్రా?"

"అంతేలే"

"జుట్టు తీయించేస్తే గుణం మారుతుందా?"

"మరి మీచెల్లెలికి—?"

"మంచోచెడ్డో అది పదోనాడే అయిపోయింది. కాకపోయినా అప్పుడు నేనూళ్ళో—"

"ఉంటే మాత్రం, నీమాట మహా చెల్లేదిసింది కానీ— సరే తరవాత?"

"ఎలాగేనా తప్పించేద్దామని రెణ్ణాళ్ళు మహా తిరిగాను; కాని మాట్లాడ్డానికే వీలయింది కాదు"

"వీలే కాలేదూ?"

"ఎప్పుడు చూసినా సుందరంగాడు వాకట్లో కూచుని వుండేవాడు యములాడిలాగ"

"అదేమిటి?"

"శాకుంతలం పాఠం మొదలుపెట్టాడులే వాడు భీమన్న మామదగ్గిర"

"శాకుంతలమా?"

"అవును. ఏదో పన్ని వాణ్ణి వాకట్లోకి రాకుండా చెయ్యమని సోమిదేవితో చెప్పాను. అది కూడా సమయం కోసం చూస్తోంది"

"సమయం"

"అవును. ఈలోపున నేను కూడా వూరుకోక 'ముప్పయ్యేళ్ళు దాటాయి కదా నీకింకా చదువేమిట్రా?' అని వాణ్ణి యద్దేవా చేశాను. దానికి వాడు— అసలు నామాటలో వున్న ధ్వని వాడికి అందలేదులే"

"అందితే భావకవిత్వం యెలా అవుతుందీ మరీ? అయినా వాడు సమాధానం యేమి చెప్పాడూ?"

"సర్వేశ్వరుడి దయవల్ల భుక్తికి లోటు లేకుండా పోయింది కదా. చదువుకోక యింకేమి చెయ్యనూ—"

"అంతే కదా?"

"అంతే అంతే ...అయితే నీకేదో అనుమానం—"

"నీకు పోటీ రాలేదు కదా అనిలే"

"ఛీ! నల్లమద్ది తుండులాగ కారునలుపూ వాడూ— లాటరీలో పది వేలు రావడంతోటే అందగాడయిపోయాడా యేమిట్రా వాడూ? పైగా, యిరవయ్యో శతాబ్దంలో కూడా శాకుంతల పట్టుకుని దేవుళ్లాడివాడికి రసికత అంటే—"

"వాడు పద్యాలల్లడుగా? అంచేత అరసికత వేరు. కాకపోయినా,— నలుపయినా వాడికళ్ళల్లో మంచి తేజస్సూ ఛలే ఆకర్షణశక్తీ వున్నాయిరా. నోరు విప్పాడంటే చకచకచక—కిన్నెరలు మోగిపోతూ ఆగాత్రమాధుర్యమూ, అరాగవరసా—ప్రస్తావన అందుకున్నాడంటే వాకటే ధోరణి కదా గంటల కొద్దీనీ! మధ్యమధ్య శ్లోకాలు విడిచిపెడుతూ, తరంగాలూ అష్టపదులూ విసు

రుతూ, చేతులు తిప్పుకుంటూ—అసలు, వాడు మాట్టాడితేనే నవరసాలూ వొలికిపోతాయి. అందేతే, యెక్కడికి వెళ్ళినా, పెద్దపెద్ద పండితులతో సరిగా వాడికి సత్కారం జరుగుతోంది"

"అసత్కారాలకీ, య్యావణయానికీ సమ్మంధం యేమిటోయ్?"

"అలా అనకు అమ్మాణ్ణి చూశావా యెలా యెదిరిస్తోందో వాడికి?

"అదో శుద్ధపిచ్చిముండ"

"మరి నిన్ను చేరనిచ్చింది కాదేం?"

"................"

పైగా, అదే కాదు, వాణ్ణి చూస్తే చాలామంది ఆడాళ్ళు పిచ్చిముండలయిపోతారు. వయసు మళ్ళిపోయిం దని వల్లకాదన్నాడు; కాని చిన్నావధానులుగారి గోపమ్మ యిరవై కాగితాలు మీదపడెయ్యలేదూ ద్వాదశి పేరుపెట్టి భోజనానికి పిలిచీ?"

"నిజమే కాని, సోమిదేవి దగ్గిర మాత్రం ఆమాట తీసెయ్యి. దాని మనస్సు నామీదే పూర్తిగా లగ్నం అయిపోయింది. ఆరు మూ డయినా అది తిరిగిపోదు. అసలు దాని మనస్సు కలి చేసినవాణ్ణి నేనే కనక, చలించిన వెంటనే నామీదే—"

"ఎప్పు డేనా—వొక్క ముద్దయినా—?"

"ఇరవయ్యేళ్ళు నిండవస్తే మాత్రం, మొగా ణ్ణెరగని ముగ్ధకదా, గభీమని అంతపని చేసెయ్యగలదుట్రా? ఘుం దెంత తాపం యెత్తాలి, తరవాత యెన్ని పీళ్ళు కలగాలి,—ఏమయినా అది నాసొత్తే, సందేహం లేదు. సుందరంగాడు కాదు, శ్రీకృష్ణుడే వచ్చినా అది కన్నెత్తి చూడదు"

"నీకంత నమ్మకం—"

"నమ్మకం కాక? నేనేం బులబులాగ్గా అల్లుకు వచ్చా ననుకున్నావా యేమిటి కథ? ఇటు సూర్యు డటు పొడిచినా అది తిరిగిపోదిక"

"బాగుంది, నీకంత ధైర్యం వున్నప్పు డిక నేను కాదంటానా? అయితే, సుందరానికి పెళ్ళయింది సుమా"

"ఏమిటీ?"

"ఇప్పుడే తెలిసింది నాకు"

"ఎప్పుడు, యెక్కడ?"

"నిన్న కాక మొన్న సాయంత్రం, చెన్నపట్నంలో"

"తణుకోయి మాచవరం అన్నట్టు—"

"అదో గమ్మత్తులే"

"పిల్ల నిచ్చిన అభాగ్యు డెవర్రా?"

"ఇవ్వడమూ పుచ్చుకోడమూ కాదు, కోరడమూ అంగీకరించడమూ అనుకో"

"అంటే?

"స్వయంవరం—"

"అంత యేబ్రాసిపిల్ల—"

"పిల్లంటే పిల్ల కాదు, మాంచి ముమ్మరంలో వుంది"

"వెధవముండా యేమిటి?"

"సరిగా వూహించావ్"

"చెన్నపట్నంలో అయితే, రాయవరం, కృష్ణయాజులుగారి అల్లుడు చేసి వుంటాడు"

"అదీ అంతే; కాని—"

"ఇం కేమిటి?"

"పెళ్ళి మట్టుకే ఆయన చేశారు"

"బోధపడలేదు"

"మా కిద్దరికీ పెళ్ళి చెయ్యండి మహానుభావా" అంటూ పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ వెళ్ళి కోరేదాకా ఆయన యిదేమీ యెరగరు"

"..............."

"ఉలిక్కిపడ్డావేం?"

"ఏమీ లేదులే, అయితే—"

"ఆంధ్రపత్రికలో దంపతుల ఫోటో కూడా—ఇదిగో చూడు"

"పేర్లు మూసేస్తావేం?"

"పెళ్ళికూతు రెవరో కనిపెట్టు, చూస్తాను"

"....ఎక్కడో చూసిందే. మన ప్రాంతమే అనుకుంటాను"

"బాగా పరకాయించు"

"రామచంద్రపురంలో చూశా నిలాంటి మనిషిని. అయితే ఆమనిషిది రాచకులం; కాని వెధవముండల్ని పెళ్ళాడేవాళ్ళకి జాతిభేదం అక్కర్లే దేమో"

"అనవసరప్రసంగం చెయ్యక యీపిల్ల యెవరో—"

"ఎక్కడో చూసిన మనిషి మాత్రం అవును"

"మాట్లాడిన—"

'ఆ, ఆ, ఆసి రండముండా! సోమిరా"

ఈమాటు చదువుకో కింది విషయం...."

"....ఎంత పని చేసిందీ దండుముండ?"

"తిట్టకు"

"తిట్టాలా పాతి పెట్టాలా, నన్ను దగా చేస్తుందా?"

"అదేమీ చెయ్యలేదు నిన్ను"

"నన్నే కా, దింకా యెందర్ని మోసంచేసిందో యిలాగ. లేకపోతే మళ్ళీ పెళ్ళికి సిద్ధపడగలదా?"

"ఇప్పుడే కాదుట్రా మహాపతివ్రత అన్నావూ?"

"ఎవడి మట్టుకి వాడికే పతివ్రత; కాని సుందరంగాడి పని పట్టాలి, ఎంత పని చేశాడూ పాడు వెధవ?"

"ఏంచేస్తా వేమిటి?"

"బోలెడు సొమ్ముతోటీ, వొంటెడు నగలతోటీ లేవతీసుకు పోయా డని భీమన్నమామచేత ఛార్జీ యిప్పిస్తాను. ముందు వాళ్ళ కిద్దరికీ అరదండాలు వేయిస్తాను మూడు నిమిషాల్లో"

"లాభంలే, దూరుకో"

"నువ్వూరుకో. నాకడ్డు వస్తాడా ఫాజీ....?"

"లేవకు. నామాట విను. వాడేమీ చెయ్యలేదు నిన్ను"

"అది కోరితే మాత్రం? గ్రౌండంతా నేను ప్రిపేరు చెయ్యగా మధ్య వచ్చి వాడు తన్నుకుపోతాడా?"

"బాగుందిరోయ్"

"ముందు పత్రిక యిలాతే"

"ఉండు. ఏమిటా వుళాక్కోడం? అసలు, పత్రి కెందుకూ?"

"భీమన్నమామకి చూపించాలి"

"గుమ్మంలోకి వెళ్ళావంటే మొగమ్మీద— తెలిసిందా?"

"ఆ?"

"సోమిదేవి అతనికి వుత్తరం రాసింది"

"ఏమిటి!"

"మరేమ టనుకున్నావ్?".... నువ్వు చేసిన కుట్ర అంత రానేసిం దది"

"ఆవెధవ రాయించి వుంటాడు"

"అలాగే కాగట్టు, అయితే మాత్రం నువ్వు చేసిం దేమయిపోతుందీ?"

"నేనేం చేశానూ?"

"నువ్వేరగవా?"

"పోనీ, నేనేం చేశానని రాసిందీ?"

"నువ్వు చెరపడానికి కుట్రపన్నావుట. ఏమిటేమిటో చెప్పి మనస్సు పాడుచేశావుట. సుందరాన్ని తానే కోరగా, పెళ్ళి చేసుకుంటే వొప్పుకుంటా నన్నాట్ట వాడు. వాడా మాట అన్నాకే నీబుద్ధి అంతా బోధపడిందిట తనకి. మద్రాసు స్టేషన్లో తాను జట్టులోనుంచి తప్పించుకోడమూ, జట్టువాళ్ళకి తెలప కుండా సుందరం ఆబండిలోనే రావడమూ, తన జట్టువాళ్ళు బళ్ళు కుదుర్చు కుంటూ వుండగా, తానూ సుందరమూ సిద్ధంగా వున్న మోటా రెక్కి యెగిరి పోవడమూ, సుందరం అదివరకే రాసి వుండడంవల్ల, కృష్ణయాజులుగారి అల్లుడు, స్టేషనుకు వచ్చి తీసుకువెళ్ళడమే కాకుండా, ఆ సాయంత్రమే తమకి చాలా వైభవంగా పెళ్ళి చేసెయ్యడమూ— అంతా వూసగుచ్చినట్టు రాసే సింది"

"అది రాయవచ్చింది"

"దస్తూరీ స్వహస్త మోయ్ పప్పా"

"దానిల్లు వల్లకాడు—"

"అదేం కర్మం? దానిల్లు దోసతోట అయి కలకల్లాడుతూ వుంటుం దిక"

"అదీ వొక బతుకే"

"బుద్ధి చలించాక అదే మంచి బతుకు"

"అయితే, నువ్వు కూడా కానియ్యవోయ్"

'అది తరవాత చూసుకుందా మోయ్"

"ఆయినా నేనూరుకోను. వాళ్ళని సుఖపడనివ్వను నేను"

"వాళ్ళకి పెద్ద పెద్దల ఆసరా వుం దెగిసిపడకు"

"ఏంచెయ్య మంటావురా మరీ?"

"ఓ పుస్తకం రాసెయ్యరా"

"ఛః చంపుతావురా నువ్వు"

"పోనీ, కిక్కురు మనకు. ఏమీ యెరగనట్టు—"

"సిద్దాన్నం తన్నుకుపోయాడురా ఛండాలుడు"

"పెట్టిపుట్టాడు వాడు. ఇప్పటిదాకా పెళ్ళి కాకపోయినా, చివరికి, నిక్షే పమూ, నిక్షేపం లాంటి పెళ్ళామూ—"

"పోతూ పోతూ నా కంఠాని కూ్కడా బిగించిందిరా దండు ముంద పురీ"

---

గ్రహించు:

"కనకే, చప్పచప్పగా వూరుకో. దొంగకి తేలు కుడితే యేం చేస్తాడు?"

"శాస్త్రులు మామ తిట్లకి లంకించుకుంటే?"

"అదే నన్ను కదిపిం దని బుకాయించు"

"నమ్ముతా డంటావా?"

"అయితే, నెల్లాళ్ళు అజ్ఞాతవాసం చెయ్యి."

"............ ..."

"ఊళ్లోనే వుండవద్దు"

"ఎక్కడికి పోనూ?"

"మండపేట వుండనే వుంది కాదూ?"

## 3

"కొప్పవరంనుంచి కబురు వచ్చిందా?"

"ఇప్పుడిప్పుడే వెళ్ళాడు గుమాస్తా, మురుగుకాలవ దాటతా డీపాటికి"

"పంతులుగారితో నీమాట చాలా దూరం చెప్పాను నిన్న"

"దయ వుంది కనక"

"నాతో పాటు నలుగురికీ ముట్టచెప్పించా లని చూస్తాను; కాని నామట్టుకే చూసుకోను నేను"

"నుంచునే మాట్లాడుతున్నావు"

"స్నానాని కిప్పటికే ఆలస్యం అయిపోయింది. అల్లుడు కూడా వచ్చాడు రాకరాక"

"ఒక్క క్షణం ..."

"....చా పెందుకోయ్?"

"ఉంది కాదుటోయ్?"

"..............."

"ఎవరెవరి కేర్పాటు చేశావ్?"

"నీకూ, నాకూ, సీతాపతిశాస్త్రికీ, సుబ్బావధానికీ, రామభద్ర చయనులికీ—"

"మొన్ననే కొట్టుకు వచ్చాడు కదా నాలుగువేలు?"

"అయితే? డబ్బు చేదా? కాకపోయినా వాణ్ణి కూడగట్టు కోకపోతే చిక్కు లున్నాయి"

"ఏదో లౌక్యం—"

"అలా అనుకోకు. వాడు నోరుగలవాడు. డబ్బు లక్ష్యం లేనివాడు. చేతిలో లేకపోతే నిమిషాల్లో సంపాదించగలడు. పైగా, అధికారి ప్రాపకం వున్నవాడు"

"కానీవోయ్, నేను వద్దన్నానా?"

"ఇంతకీ: పెద్దకూతుర్ని రంగూన్ ప్రయాణం తప్పించి రామేశ్వరం తీసుకువెళ్ళినందుకు వాడిమీద పంతులుగారికి చాలా విశ్వాసం కలిగివుంది. పదిమాట్లు చెప్పా రాయన, వాడిమాట"

"అప్పుడు చేదుమేశాడా యేమిటి వాడు?"

"నీసొమ్మా నాసొమ్మా అది? కాకపోయినా, వచ్చేచోట నువ్వు మాను కుంటావా, నేను మానుకుంటానా?"

"నామాటకేం గానీ—నాకూ వాడు కావలసినవాడే. కానీ—రామదీక్షితులు వొప్పుకోడనుకుంటాను"

"కుర్రకుంక, వాడికేం తెలుసునోయ్?"

"పోనీ గానీ—నూరేసే యేర్పరిచావేం?

"అక్కడికే చుక్కలు దుళ్ళాయి. సీమ వెళ్ళాడన్నమాటేగాని సుబ్బారావు కేమేనా అంటిందనుకున్నావా?"

"చదువంటిందా లేదా అని కాదు, మన—"

"అది సరే. "కోరి నాపేరు పెట్టించుకున్నాను; కాని వీడి కక్షరం ముక్క అంట"దని గోలపెట్టేవారు సుబ్బయ్య దీక్షితులుగా రెరగవూ?"

"అవునవును"

"బారిష్ట రనిపించుకున్నా, డంతే. నోరూ వాయీ లేదు. ఒక్క కేసు—రామచంద్రపురం మున్సబుకోర్టులో సుమా—నడిపించగల దని తోచదు"

"నడిపిస్తే మన కేమయినా వొరగతోస్తాడా?"

"అది కాదు సంగతి. తాలూకా సనాతనధర్మ సభకి ప్రెసిడెంటుగా వున్నారు కనక గాని, లేకపోతే, రామచంద్రశర్మగారు మాత్రం సిద్ధపడతారా యేమిటి, కొడుక్కి ప్రాయశ్చిత్తం చేయించడానికి? సుబ్బారావయినా, ఆస్తంతా తండ్రి స్వార్జితం కనక ప్రాయశ్చిత్తం చేసుకోడాని కంగీకరించాడు గానీ—యీ తంతు కాస్తా అయాక — అవేమిటీ రెయిలుస్టేషన్లలో వుంటాయిటా? వాటిల్లో తినడమూ తాగడమూ మానుకుంటాడా యేమిటి రుచిపడ్డాక?"

"చయనులు రామేశ్వరం అంటే తీసుకువెళ్ళాడు; గాని పెద్దకూతురు—"

"సరిగదా? మొన్ననేనా ఆసుపత్రినుంచి వచ్చిందీ? మనం ఆ మోతాదు

గ్రహించుకోవద్దూ? మనకే అయిదు వంద లయినాయి, సంతర్పణకీ—సంభావనలకీ—మరో మూడు వందలేనా కావూ?"

"చాల్తాయా?"

"కనిపెట్టుకుని వున్నాడు కనక రామదీక్షితులికి ముట్టచెప్పడానికి కుండలాలు చేయించారు విన్నావా?"

"అలాగటోయ్? భేషూ?"

"ఆపైని చిల్లర లుంటాయి రామచంద్రపురంనుంచి వుద్యోగస్థుల్నీ, ప్లీడర్లనీ, మేష్టర్లనీ రప్పించి కాఫీలూ అవీ కూడా పోయిస్తారుట. మధ్యాహ్నం హరికథా, రాత్రికి సొంత సాని గొల్లవేషమూట. మొత్తానికి సంచికి తక్కువ—"

"సరే సరే. వచ్చేదుంటే నువ్వు మాత్రం పోనిస్తావా? దీంతో ఫిబ్రవరి కిస్తీ చెల్లిపోతుంది కదా?"

"మార్చి కిస్తీ వెంకుసోదెమ్మ చెల్లిస్తుందిలే, బెంగవద్దు"

"అది కూడా సిద్ధం అన్నమాటే?"

"సిద్ధం అంటే ఎప్పుడోనా, ద్వాదశినాడయిపోవాలి. ఏకాదశి వుపవాసమూ ద్వాదశి పారణా కలిసిరావద్దుటోయ్!"

"అలాగా?"

"అంతేనా? కొడుక్కి శేషావధాని కూతుర్ని—"

"ఆ!"

"వాడు కూడా మొగ్గుతున్నాడు. అంచేతే మనకి తలో వందా యివ్వడానికి వొప్పుకుం దది"

"శేషిగాడు మొగ్గుతున్నా డంటే అబ్బరమా? యాభై వేలు కరుకు లున్నాయి ముండదగ్గిర. కానిపని చేస్తే మాత్రం దాని కేం పోయిందీ? మేమమ్మా మహా చదివేశా మని విర్ర వీగుతున్నాము; గాని మనలో వొకడి దగ్గిర అయినా ఆ మాత్రం వుందీ?"

"మన దేవతార్చనలే మనకి ఆస్తి. అవి లేకపోతే మనల్ని చూసేవారెవరోయ్?"

"బాగా చెప్పావు; అయితే చూడూ, దేవతార్చనవంటకి అదే సిద్ధపడుతుందేమో?"

"లేకపోతే దాని కేం వొరిగిందోయ్! ఓరి నీయిల్లు — మనం స్వయంపాకాలు చేసుకోడానికిటోయ్, అయిదు వందలు కరుకులు గుమ్మరించడం?

"దిక్కుమాలిన ముండ రంగూను కూడా తగులడిం దని వింటాం గదా, చూస్తూ చూస్తూ మాలకూడు—"

"ఇక ఆవేషా లన్నీ కట్టిపెట్టు. పంచగవ్యప్రాశన చేశాక—మంత్రాలకు శక్తి వుందంటావా లేదంటావా నువ్వు?"

"లేకపోతే అయిన నూరేసీ చెల్లించి మనకి పాదపూజ చెయ్యడం యెలా సంభవిస్తుందీ?"

"ఇంకేం?... ఇంతకీ: శంకరాచార్యపీఠం మూలపడింది కనక మనకి ఆవాహన వచ్చింది; కాని—"

"నిజమే నిజమే. పీఠమే వుంటే సొమ్ము పీఠానికీ, మాలకూడు మనకీ—"

"అవునుకదా?....లోకవృత్తం మనం కొంచెం పరకాయించుకుంటూ వుండాలి. బిగించనూ కూడదు, విడిచిపెట్టనూ కూడదు. పది రూపాయలు చేతిలో పడ్డమే మనకి ప్రధానం"

'అంతే అంతే. శాస్త్రం మాత్రం యేం చెబుతోందీ? శాస్త్రంలో వున్న బండారం అంతా ప్రాయశ్చిత్తాలే కాదుటోయ్?"

"అదిగదీ మాట. చాంద్రాయణం చేస్తే అన్ని పాపాలూ చెల్లు. మరి చాంద్రాయణం అంటే?"

"మనకి తలో వందా—"

"ఇత్యర్థః "విత్తశాఠ్యం న కారియే" త్తన్న కారిక చాలదుటోయ్ మనకి ప్రమాణం? "ఎంతచెట్టు కంతగాలి" అన్నట్టు నడిపించకపోతే మనం పనికి వస్తామఃటోయ్?"

"సరే గాని, సుబ్బలక్ష్మి రామభద్రచయనులు వెంటపడిం దని తెలిసిం దేమిటి?"

"నిజమే అనుకో"

"నీకూ తెలిసిం దన్న మాటే"

"ఏదో శాస్త్రం చెప్పినట్టుంది. అసలీ పురమాయిం పెవరిదో—"

"ఆ, ఆ!"

"అయితే వొకటి. తోటికోడలు తెచ్చిన మనోవర్తి దావాలో పనిచేసి పెట్టడానికే నాయేర్పాటు. ఇక తరవాతి సంగతా? ముప్పయేళ్ళ పీనుగు—షడ్రుచులూ సుష్టుగా అనుభవిస్తున్న బంగారబ్బొమ్మ, ఎదో – మనకెందుకు పోనిస్తూ"

"ఊరంతా చుట్టపెట్టేలా వున్నాడు వాడు"

"పోనీ, తోటికోడల్ని నీస్వాధీనం చెయ్యనా?"

"నాకొద్దు బాబూ"

"రామసోదెమ్మే చాలు కాటోలు నీకు"

"అనేకవిధాల పొమ్మన్నాను; కాని గిజా అంది. బలవంతాన పొమ్మన డానికీ నాకు మనసొప్పడం లేదు. దాని ప్రాణం నా ప్రాణానికి లంకెట. పైగా, పాపం మాట లనుకోగూడదు, అడుగంటిపోయిన సమయంలో నన్ను లేవతీసిం దదే."

"పెట్టిపుట్టావు ...సరే కాని—రేపు సోమేశ్వరంలో సదస్యం నిశ్చయ మేనా?"

"చల్లబడేటప్పటికి కబురు వస్తుంది"

"తలో రూపాయీ—"

"ఛస్ ...అయిదుగురికి పిల్లకాసులు. అయిదుగురికి కోనసీమ చాపులు. పాతికమందికి రూపాయలు—"

"సెలగో సెలగ. అస, లంతమంది పండితు లేరోయ్ మన ప్రాంతాన? అయితే, కాసులు—"

"నీకూ నాకూ తప్పదు"

"రామభద్రయ్యనుల్ని కూడా కలుపు"

"ఏం?"

"చెబుతా కాదూ?"

"వాడి కూతుర్ని నీకొడుక్కి—"

"అప్పడే నీదాకా వచ్చిందీ?"

"ఏమాత్రం?"

"వెయ్యిన్నూట పదహార్లు కట్నం. అమాంబాపతూ మూడు వందలు లాంఛనాలు. పైగా, వుభయఖర్చులూ—"

"అవేమాత్రం లే?"

"అలా అనకు. బాండు తేవాలా? మేళం పెట్టాలా? సంస్కారులికి వరహాచొప్పున సదస్యం చెయ్యాలా?"

"వచ్చినవారి కందరికీ నూతనవస్త్రాలు—"

"కాఫీ వుప్మాలు—"

"తప్పతుందీ మరి? ఇంకొక్కటి కూడా—"

"ఏముటోయ్?"

"మాయింటో మనుగుడుపులు కూడా వాడిఖర్చుమీదే బహుమతీలు కూడా—"

"సెబాస్! ఇది కొత్త ఆచారం. చాలా బాగుంది. పోనివ్వకు"

"జామార్లు కట్టుకోడం తరవాయి. రేపే స్థిరపరిచాం మొదట; కాని చివరికి ఎల్లుండి నిరుకయింది"

"బాగుంది"

"మరి వెడతా....పదకొండు కాదూ?"

"....అదిగో... సరిగా కొడుతోంది, విన్నావా?"

"మీరంతా సంపాదించారోయ్ తలోటినీ. నాకే శ్రద్ధ లేకపోయింది"

"మాలాగ నువ్వు పాతిక రూపాయలు గంగలో పోస్తావుటోయ్"

"ఎన్ని పోశాం కాదు గానీ—"

"ఓపని చెయ్యరాదూ?"

"ఏమిటదీ?"

"అలకపాన్పుమీద—"

"సైకిలు తప్పదు కదా?"

"ఇది కూడా జోడించవోయ్?"

"నువ్వు చెప్పంది బాగుంది. అలా యేర్పాటు చేతాం"

"తప్పకుండానూ"

"మరి పోతా"

"పద"

## 4

"లక్ష కాదు, కోటి చెప్పు నువ్వు, నేను మాత్రం—ఊఁహూ"

"నే నెందుకు వద్దంటున్నానో కొంచెం ఆలోచించుకో"

"మాచెల్లెలు వెధవ రజస్వల అయినప్పుడు వాడు చేసిన అల్లరి మరిచిపోయావా? తరవాత, దానికి పెళ్ళి అయిం దనిపించే టప్పటికి నాగడ్డి నేను తిన్నా నే?"

"మీనాన్న వాణ్ణి తిప్పలు పెట్టాడు. వాడు మిమ్మల్ని వీధిలో పెట్టాడు"

"ఇంకేం? ఈ విరోధం మాకు తరతరాలనుంచీ వస్తున్నదే. ఇవాళ నేను భంగపరచడం యెందుకూ దాన్ని?"

"అది నిజమే; కాని నువ్వు కాస్త పస్తాయించా లిప్పుడు"

"ఎందుకో?"

"నేను చెబుతున్నాను కనక"

"బుద్ధిపూర్వకంగా విషం పెట్టి కోడల్ని చంపితే, వాడెక్కడో దేవుడంటూ నన్ను దిగలీస్తా వేమిటోయ్?"

"సూతిక వచ్చి చచ్చిపోతే విషప్రయోగం అంటా వేమిటోయ్ నువ్వు? రామచంద్రపురంనుంచి పెద్దడాక్టరు వచ్చి రెండు దినాలు ఇంజెక్షనులు కూడా చేసి వుండగా ముందూ వెనకా చూసుకోకుండా గంతులేస్తా వేమిటోయ్? కేసు నిలుస్తుందిటోయ్?"

"నిలవే నిలవ దనుకో. దహనం కాకుండా శవం రెండు దినా లాపు చేయిస్తే చాలదూ వాడికి ప్రాయశ్చిత్తం కావడానికి?"

"నీమాటమీద బకిరు రానీ, మునసబు, శవాన్ని అటకాయిస్తా డన్న నమ్మకం యేమిటి?"

"అలా చేస్తే అతన్నిమాత్రం బతకనిస్తానా నేను?"

"నువ్వే మునగాడవు వూళ్ళో కల్లాను. మరెవడూ మొగాడుకాడు, ఏం?"

"ఈవిషయం అలాంటిదేలే, నీకు తెలవదు"

"పోనీ, వాడి పక్షం రామభద్రచయనులుగారున్నారు. అది నీకు తెలుసా?"

"ఉం—టే?"

"రేపీపాటికి నీకొంపా గోడూ—"

"విసిరిపారేస్తాను మరోచోట తెచ్చి. ఆయనే మహా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్టు మాట్టాడతావేమిటి నువ్వు?"

"నిన్నగాక మొన్న తిరగరాశావు నోటు, కావాలనేప్పటికి నీకు మహా—డబ్బు పుట్టేటట్టూ—నీసంగతి నాకేమీ తెలవనట్టూ మాట్టాడతావేమిటి నువ్వు?"

"....అబ్బా! విషమప్రశ్నలు వేసీ, కథ, అడ్డం తిప్పి ఛంపేస్తావురా నువ్వు"

"హు—హు—....నిన్ను, చంపడం కాదిది, అనవసరపు సుడిగుండాల్లో పడి మునిగిపోకుండా తేల్చడమూ పట్టుకోడమూను"

"శవం అవతలికి వెళ్ళకుండానే నీకూతుర్ని స్థిరపరచడానికి చూస్తున్నట్టు కనపడుతుంది, నీధోరణి చూడగా"

"పోనీ, నీకూతురికి మాట్టాడనా?"

"నాకు మరో సమ్మంధం దొరకదనీ"

"నాకే దొరకదు, కదూ?"

"....నీకు పుణ్యం వుంటుంది కానీ—నన్ను విడిచిపెడుదూ నాయనా"

"....నీయిష్టం వచ్చినట్టు తంటాలుపడు....మధ్య నాకా యీరొష్టంతా...."

"....నుంచో....వొరేయ్! మాట పూర్తి కాకుండానే తారకస్థాయికి వెళ్ళిపోతే యెలాగరా, దానిల్లు వల్లకాడుగాను"

"నేనవతలికి పోయినా తప్పే?"

"పోయి వూరుకుంటావా? పట్టామణీని తిరగతీస్తావు. మూడువేలివ్వాలి నీకతగాడు. నువ్వు కళ్ళెర్రజేస్తే కుంయి మనలేడు"

"నీకు తోడల్లుడేగా వాడూ? పైగా, నీదగ్గిర పరాయతం చెప్పుకున్న శిష్యుడేగా?"

"నా కడుపు మహా మండిపోతోందిరా! ఒక్కమాటు బదులు తీర్చుకోనివ్వరా"

"కానియ్యవోయ్, నీకడ్డేమిటి? నేను వెళ్ళిపోతానన్నాను కాదూ?"

"అబ్బా! తడిగుడ్డతో గొంతు కోస్తావురా నువ్వు"

"నువ్వు మహా—ధర్మరాజువి....అవునా?"

"పోనీ, వాడప్పుడలా అల్లరిచెయ్యవచ్చా?"

"నలుగురూ వాణ్ణి చివాట్లు పెట్టలేదూ అప్పుడూ?"

"దానివల్ల నాకేం వొరిగిందీ?"

"ఇప్పుడు దీనివల్ల యేం వొరుగుతుందీ? దెబ్బకి దెబ్బ తీస్తే వొకవిధంగా నేనూ వొప్పుకుంటాను. అయితే, బదులు తీర్చుకోడాని కవకాశం వుండొద్దూ. వాడికోడలిప్పుడు చచ్చిపోయిందంటే అందులో అనుమానాస్పదమైనదేం వుంది? అప్పుడు మీ చెల్లెలు రజస్వల కావడం అబద్ధమా?"

"..............."

"ఈ వ్యత్యాసం అలా వుంచు. నువ్వు చేసిన పనికి కొందరేనా హర్షించాలి. వాడి కలాంటి కోడలు మళ్ళీ దొరుకుతుందా? అది పోయినందు కింటిల్లపాదీ వొక్కతీరున గోల పెట్టేస్తున్నారు చూడలేదూ? ఊళ్ళోవాళ్ళు కూడా—"

"ఆపిల్ల నేమయినా అంటే పురుగులోడి—"

"మరి ఆపిల్ల శవం అటకాయింపిస్తే?"

"నవనాడులూ కుంగదీశావురా. పైని నీళ్ళు చల్లుతున్నట్టే కనపరుస్తూ కింద మంటలు పెట్టావురా"

"నీకంత కష్టంగా వుంటే—"

"నుంచో—వోరి నీయిల్లు—పోనీ నావుక్రోషం తీరే వుపాయం చెప్పు"

"నేను చెప్పింది నీకు నచ్చదు"

"అయినా చూతాం"

"నాతో కూడా రా"

"వచ్చి?"

"నీకిలాంటి ఆపత్తు వచ్చిందా?" అని మనస్ఫూర్తిగా పరామర్శ చెయ్యి వాణ్ణి"

"..............."

"ఆపిల్ల మహాయిల్లాలు కనక వోకొమ్మ——"

"ఛా——ప్పగా వుంది"

"చెప్పాను కాదూ? జ్వరితుడికి పంచదార చేదు, కామెర్ల రోగికి జగత్తంతా పసుపు"

"..............."

"నీహృదయం చ——ప్పనిది నీబుద్ధి చ——ప్పనిది, అసలు నీజన్మే చా——ప్పనిది"

"నేనేమీ చెయ్యను గానీ—— యిక నీదారిని నువ్వు దయచెయ్యి బాబూ".

"చెయ్యి, మాను, నీయిష్టం. నాకు పోయేదేమీ లేదు; కాని కడుపు చించు కుంటే కాళ్ళమీద పడుతుంది"

"ఆబుద్ధి అందరికీ వుండొద్దూ?"

"ఉండాలి. ఉండితీరాలి. లేదు. లేదు కనకనే యిప్పుడు బ్రాహ్మడంటే కంపుకంపు"

'మాట్లాడితే నువ్వు ఉపన్యాసం పేలగొడతావ్"

"నీదగ్గిర పేలగొడితే "బధిరశంఖారావం" అని తెలిసే సుమా"

"ఒరేయ్, ఇక నోరు మూసుకుంటావా లేదా? పేగులు తోడేస్తావేమిటి పిశాచం లాగ?"

"నీకంత కష్టంగా వుంటే——ఇదిగో——"

"ఈవుపకారానికి వాడు నీకేం చేసినా చెయ్యవచ్చు"

"....నేను చేసింది వుపకారమే అయితే, అది వాడికి కాక నీకే అని బోధపడకపోవడం——ఎందుకులే?"

## 5

"చూశారా?"

"ఏమిటి?"

"పోనీ, విన్నారా?"

"ఏమిట్రా అదీ?

"ఇవాళ శంకరప్ప తండ్రి తద్దినం"

"అయితే?"

"నిన్నరాత్రి యెనిమిదింటికి ప్రవేశించాడు పిచ్చాయి మేడ. వంటలయి పోయాయని కబురుమీద కబురు వెళ్ళగా, యివాళ—యిప్పుడిప్పుడు దిగాడు మళ్ళీ"

"మీరంతా అంతేగా?"

"అదా మాట?"

"ఏం, తప్పుమాట అన్నానూ? మీకుర్రకారుకి మంచీ చెడ్డా యేమయినా తెలుస్తోందా? పుట్టింది బ్రాహ్మణవర్ణం అని యేకోశాన అయినా జ్ఞాపకం వుందా"

"పెద్ద పెద్దలు మాత్రం?"

"పెద్ద లేమిటి చిన్న లేమిటి తప్పుపని చేసినప్పుడందరూ వొకటే; కాని మీకూ వాళ్ళకీ వొక్కటేడా వుంది. పెద్దవాళ్ళు వూరుమాటుమణక్కుండా వాళ్ళయింటికి వెళ్ళరు. కాకులు కూశాక మరి అక్కడ వుండరు. వ్రతం పాడవు తోంది గాని వాళ్ళ కులం చెడడం లేదు. మరి మీకుర్రకారుకి సాధారణంగా ఆహారపానాలు అక్కడే కదా?"

"అదే నేను చెప్పవచ్చేది"

"మాకు తెలవకపోతేనా?"

"దరహంమీద—"

"విడివిడిగా మాత్రం మాకు తెలవదా?"

"అయినా యిది వినాలి"

"ఊఁ, కానియ్యి, పోయిందేమిటి? ఇదివరకి విన్నవాటి కంటే మించి పోదులే"

"బోగందాని చేతి కాఫీ—"

"'అది రుచి చూసిన కాఫీ అను''

''సందేహమేం?''

"ఇంకా?''

''ఉప్మా కూడా తినే వుంటాడు''

''తిని వుండకాపోవచ్చు''

''మీరిలా అంటారని నాకు తెలుసు''

''నువ్విలా చెబుతావని నాకు తెలవదా?''

''....ఇదే మీదగ్గిర వున్న దోషం. ఎలా అంటే బాధ్యత తప్పిపోతుందో అలా అనడం బాగా నేర్చుకున్నా రీవూరి పెద్దలు''

''మరేమనాలీ?''

''అందరికీ సమానంగా గడ్డి పెట్టవద్దూ?

''ఎవరికి మానామూ?

''మరి శంకరప్పని—''

''రుజువేదీ?

"నేను చెప్పిందంతా అరణ్యరోదనమే?''

"అక్షరాలానూ"

"................ ..."

"నువ్వు నిలువునా అబద్ధం చెప్పావు. నన్ను దగా చెయ్యడానికిన్నీ సిద్ధపడ్డావు"

"మంచి యుక్తి"

"..................."

"మీరు నమ్మకపోతే మాత్రం సత్యానికి భంగం కలుగుతుందా?"

"ఏమిటో ఆసత్యం?"

'నేను చెప్పిందే"

నువ్వు చూశావా?"

"ఆ"

"మరి తినే వుంటా డన్నా వేం?"

"అది మాత్రం నేను చూడలేదు సుమండీ"

"మరి కాఫీ పుచ్చుకోడం?"

"నాకళ్ళారా చూశాను. మామేడవసారాలో నుంచుంటే స్పష్టంగా కనపడుతుంది"

"నువ్వు చూసిం దేమిటో చెప్పు"

"పిచ్చాయి తల్లి, వాళ్ళు కూచునివున్న గదిలో నుంచి రెండు వెండి కప్పులు తెచ్చి వసారాలో కడిగింది"

"కావచ్చు"

"ఒకటి వాడు కాఫీ పుచ్చుకున్నదీ, రెండోది పిచ్చాయి—"

"అవతలికి పోరా"

"పోనీ, పిచ్చాయి, వాడి నోటికి తాంబూలం అందిస్తూవుంటే నే నీకళ్ళతో చూశా నండీ"

"కావచ్చు. వాడు పట్టీ వేస్తాడు"

"...................."

"అది నల్లమందువంటిది. తద్దినం అయేది, చివరికి శ్రాద్ధం అయేది. అలవా టయినవాడు మానలేడు"

"మీ రేమంటా రండీ?"

"ఏమీ అనను"

"మరి నేను సుభద్రాచలం యింటో సగ్గుబియ్యపు పరమాన్నం పుచ్చుకున్నా నని మీరంత రగడ పెంచా రెందుకూ ఆవేళ?"

"నువ్వా పని చేశావు కనక"

"....................."

"అది రుజు వయినిది కనక"

"....................."

"నువ్వే వొప్పుకున్నావు కనకా తెల్లమొహం వేసి"

"మరి వాడిమాట?"

"సాక్ష్యం?"

"ప్రతీ అక్షరానికి సాక్ష్యం కావా లంటే సాధ్యమా?"

"లేకపోతే మేమేం చెయ్యము?"

"................"

"నువ్వు కోడిగుడ్డు తిన్నా వంటా డొకడు వచ్చి"

"................"

"నీలాగే వాడూ నిదర్శనం చూపించలే దనుకో"

"నిదర్శనం వున్నవిన్నీ మీరు వదిలేస్తున్నారు"

"ఏమిటవి?"

"చెప్పెయ్య మంటావా?"

"నాలుగు"

"................"

"రెండు"

"................"

"పోసీ వొకటి"

"................"

"నాలుక అడదేం?"

"................"

"చెవలవాణమ్మా, నోటికి వచ్చినట్టల్లా పేల్తావూ?"

"................"

"నువ్వూ వాడూ యెక్కడో పోటీలు తగులడ్డారు. అక్కడ నువ్వు గుడ్డిగవ్వకిని మారలేకపోయావు. చివరికి యిలాగ యెత్తు వేశావు"

"..............."

"అనవసరపు గొడవల్లో దిగక వొళ్ళు తెలిసి మసులుకో"

"వద్దుసుమండీ....ధర్మం కాదు సుమండీ"

"ఏమిటది?"

"సీతప్ప కూతురు భ్రూణహత్య చేసిందా లేదా మొన్న మొన్న? రామచంద్రుడు కూతురు రంగూన్ దారి పట్టిందా లేదా రెణ్ణెల్ల కిందట? జోగన్న శాస్త్రి మనుమరాలు పుట్టింటా కాకుండా అత్తింటా కాకుండా వారందినా లేష్యమయిపోయిందా లేదా? నాగావధానులుగారి శంభన్న మాలపాలి కాపుకి గడ్డిమోపెత్తాడా లేదా?"

"సాక్ష్యం, సాక్ష్యం. పొడిమాటలు చెల్లవు మాదగ్గిర"

"అయితే, వెంకుసోదెమ్మ చేతివంట మీరంతా ఆరగించారా లేదా?"

"ఆరగించాం"

"ఆవిడ రంగూర్నాలో నాలుగేళ్ళు—"

"నాలుగేళ్ళు కాదు వొక్క దినం చాలు మాకు"

"మరెలా వొప్పుకున్నా రండీ? మీపెద్దరికం—"

"దాని నాలుక తెగ్గాల్చాం. పంచగవ్యాలు పడపోశాం"

"..............."

"పునర్జన్మ యెత్తించినంత పని చేశాం"

"తలో వందా కొట్టారు"

"అదీ నీయేడుపు. మరి నీ కిచ్చింది కాదేం?"

"నావంటివాళ్ళ కిస్తుందీ?"

"నీవంటివాళ్ళూ అదీ సమానమే అన్నమాట"

"..............."

"మాకు తాహ తుం దన్నమాట. మాకా అధికారం వుందన్నమాట. మాకా ప్రామాణికత్వం వుం దన్నమాట"

"..............."

"తప్పు చేసినవాళ్ళని మేము శిక్షిస్తాం. కానికూడు తిన్నవాళ్ళకి కిలం వదిలిస్తాం. పశ్చాత్తాపపడ్డవాళ్ళని ప్రాయశ్చిత్తం చేసి వుద్ధరిస్తాం"

"ఆడబ్బుతో వడ్డీవ్యాపారం చేస్తారు"

"నీలాగ వాళ్ళు మరిచిపోయి కుదే లయిపోయినవాళ్ళని నడివీధిలో నిలేస్తాం. కొంపాగోడూ టమటమా—"

"వెళ్ళండి మీనీతులూ మీరూనూ...."

"నువ్వే వెళ్ళాలి. మేం కదలం. మేం చలించం"

"హు...."

"అప్రాచ్యుడా, కాని కూతలు కూస్తావ్?"

## 6

"ఉసూరు మంటూ వస్తున్నావు"

"కొట్టేశాడు"

"ఆ!"

"ఖర్చులు కూడా యిచ్చుకో మన్నాడు"

"అయ్యో!"

"శుద్ధసత్యం సర్వాబద్ధం అయిపోయింది"

"కలి, కలి"

"మీ ఆశీర్వచనం తప్పకుండా కాస్తుం దనుకున్నాను"

"అక్షరాలా జరిగిం దానికీ నా ఆశీర్వచనం యెందుకోయ్? పోనీ, నామూలాన చెడిపోలేదు కదా?"

"శివశివా!....ఏమీ యెరక్కపోయినా సకలమూ యెరిగివున్నట్టు చెప్పారు మీరు. నాకోసం ఈచివరినుంచి ఆచివరిదాకా శుద్ధాబద్ధాలు చెప్పారు మీరు"

"మొలిచినట్టు—"

"అవునవును. ఒక్కమా టయినా తేలిపోలేదు మీరు"

"నువ్వు కనక. తెలిసిందా? మరొక డిలా చెప్పనుంటే గుమ్మంలోకి రానివ్వకపోదును"

"అవునవును, నే నెరగనూ? మా అమ్మ బతికి వున్నంతకాలమూ మా వ్యవహారాలు మీరే దిద్దారు. అప్పుడే పదివేలు మించని మా వ్యవహారం లకారం దాటిందిట"

"నువ్వు చిన్నవాడవు. మీఅమ్మ నన్ను నమ్మింది"

"మీచేతిలో కాని ప్రాణం విడవ నని—"

"మీనాన్న బతికి వున్నంతకాలమూ కడుపునిండా అన్నం యెరుగునా మీ అమ్మ? దిక్కుమాలిన చాదస్తాలూ, అర్థంలేని అనుమానాలూ పెట్టుకుని — అతగా డేనా సుఖపడ్డాడా పోనీ?"

"..............."

"తరవాత మీఅమ్మ రాణి అనుభవించిన ట్టనుభవించలేదూ? నిన్ను యువరాజుగా చూడలేదూ నేను?

"ఆరోజులు మరి రావు"

"నీమామగారు లౌక్య డనుకున్నాను"

"ఆయన పెత్తనం వచ్చాకే రుణస్థు లందరూ యెదురు తిరుగుతున్నారు"

"కొంచెం నోటితొందర—"

"కొంచెమా, కావలసినంత. తండ్రిని చూసి కూతురుకూడా—"

"ఈసమ్మంధం నాకెంతమాత్రమూ యిష్టం లేదు. ఎలాగేనా యిది కాకుండా చేద్దా మని మీ అమ్మ మూడుపవాసాలు చేసింది. అంత మంకుపట్టు పట్టి మీనాయన మాత్రం ఏమి బావుకున్నాడులే, సంవత్సరం తిరక్కుండా—"

"అది సరే. ఇప్పుడీవ్యవహారం అయినా నా మామగారి దురుసుమాటల వల్లనే కాదూ కోర్టుకి వెళ్ళవలసి వచ్చిందీ?"

"దానికేం, మునసబు మాట చెప్పు. నేను చయనం చెయ్యడమే కాకుండా గొప్ప కర్మిష్ఠి ననీ, మహావిద్వాంసు ణ్ణనీ, ప్రామాణికు ణ్ణనీ బాగా యెరుగును. తెగపొగడుతాడు. ఇంటో కొత్తకుండ తడుపుకుంటే నేను వెళ్ళాలి. అలాంటి నాసాక్ష్యం అయినా—"

"ఒక్కటి విన్నాను"

"కనకాచలం మాటేనా?"

"మీకూ తెలిసిందీ?"

"ఈవూళ్లో నాకు తెలవకుండా గాలి అయినా విసురుతుందిట్రా వెర్రి వాడా?"

"రామభద్రచయనులుగారు పురమాయించారుట. మూడు రాత్రులికీ మూడు కాసు లిచ్చాట్ట వెంకటేశం"

"మరి మున్సబు? దాని చాతుర్యానికి దంగయిపోయి యాభయి రూపాయలు—"

"ఆ, ఆ!"

"కాకపోతే? అముఁకమూ అర్యాసప్తశతీ నూరిపొయ్యలేదుట్రా నేను దానికి?"

"కొండు శ్రౌంతి కూడా నిలువునా దగాచేశాడు"

"వాడు రామభద్రచయనులు మనిషి"

"రామభద్రచయనులుగారు నామీద యింత కక్ష కడతారనకోలేదు నేను"

"ఇది చివుకుల రామిగాడితో సహవాసానికి ఫలితం నీకు"

"అలాగే కనపడుతోంది"

"అసలు తొమ్మిదివందలా?"

"అవును. సూరపరాజుగారు కూడా దావా పడేస్తే కాని—"

"మళ్ళీ రామభద్రచయనులు—"

"అదే భయంగా వుందండీ"

"పోనీ, అతగాణ్ణే ఆశ్రయించరాదూ నువ్వూ?"

"అదీ ఆలోచించాను. ఆయన్ని ఆశ్రయిస్తే ముందు రామదీక్షితులుమీద దావా పడెయ్యాలి. లేకపోతే నోటు ఆయనకి ట్రాన్స్ఫరు చెయ్యాలి. ఇందులో యేం చేసినా వాడిపని—"

"లేకపోతే నీపని?"

"................"

"ఒక్క పద్దయినా నీకు వసూలు కానిస్తాడా" ప్రతీదానికీ కోర్టు కెక్కి నువ్వేం ముందుకి రాగలవూ?"

"................"

"భూమి కొన మని శతపోరినా నామాట వినక, నీమామగారి మాటమీద వున్నదంతా ప్రజలమీద వెదచల్లావు కదా—"

"శని. నెత్తిమీద శని వుండి అలా చేయించాడు"

"అంతా నీ తెలివితక్కువ. శనీ లేదు, రాహుకేతువులూ లేరు"

"మీరు కూడా అలా అంటే—"

"ఏమన్నానూ? మరోలాగ యెలా అననూ?"

"ఆమధ్య వొక గొప్ప జ్యోతిష్కుడు వచ్చి ఇంకా మూడేళ్ళు శని యిలా బాధపెడతా దని ఖండితంగా చెప్పాడు"

"చెప్పి?"

"ఇంటిల్లపాదికీ జాతకాలు చెప్పించుకుని పదిరూపాయలిచ్చాను"

"అదిగో, అందుకోసం వచ్చాడు శని"

"మీరనవలసిన మాట కా దిది"

"పోనీ, సిద్ధాంతి మూడేళ్ళుంటా డన్న శనిగాణ్ణి వుప్పున పూడెయ్యనా నేనీ క్షణంలోను?"

"చయనులుగారి నాశ్రయించ మంటారు"

"అక్షరాలానూ"

"నాకేమీ పట్టుదల లేదు. ఆయనంటే నాకు గౌరవభావమూ వుంది"

"మరి వున్న దల్లా యింకేమిటి"

"గొప్ప చిక్కే వుంది"

"ఏమి టదీ?"

"............ ...."

"రహస్యమా?"

"సుబ్బలక్ష్మి తోటికోడలు—"

"నిన్నలుముకుంది. దావా నువ్వే చేయించావు"

"అలా వచ్చింది"

"ఇలా చేసికవాడు రామదీక్షితులు"

"..............."

"ఏం, వులిక్కిపడతావేం?"

"..............."

"రామభద్రచయనులికీ ఇలాగే తప్పనిసరి అయిందేమో?"

"కావచ్చు"

"అందులో కూడా భేదం వుందేమో చూశావా?"

"సెలవివ్వండి"

"కోటమ్మకి పెట్టుబడి నువ్వు. రామభద్రుడికి పెట్టుబడి సుబ్బలక్ష్మి"

"అనుకున్నాను"

"మొత్తానికి నువ్వూ అతగాడూ కూడా అసాధ్యపు స్థితిలోనే పడ్డారు పాపం"

"ఆయన కోటిరెడ్డికూ కూడా రాయబారాలు పంపుతున్నారుట. పది హేను వందలు, అస లివ్వా లతను. కానిరోజులు వచ్చి పడ్డాయి. కన్ను పొడుచుకున్నా డబ్బు పుట్టుక ప్రతీవాడూ ఐ.పీ కో. అబద్ధాలకో సిద్ధపడుతున్నాడు"

"అంతమాత్రాన మునిగిపోయిందేమిటి కానీ—నీడబ్బుకి పోటీ రాకూడదంటే—వెంకటేశం బాకీ కూడా మళ్ళీ బతికి నిమిషాలమీద వసూలు కావాలంటే మార్గం మాత్రం లేకపోదు"

"అదే, రామభద్రచయనులుగారి పాదాలు—"

"అంతే, అంతే"

"పోనీ, మీమాటమీద అలాగే చేస్తాననుకోండి—వేదం అంతా క్షుణ్ణంగా వచ్చిన విద్వాంసుడు ఆయన పాదాలు పట్టడం నాకు శ్రేయస్కరమే అనండి—మరి నామామగారు—"

"తెల్లావారేటప్పటికి గంగలకుర్రు వెళ్ళి తిరిగిచూడరుట్రా?"

"సరే, అలాగే అనుకుందాం, తరవాత?"

"చివుకుల రామిగాణ్ణి విడిచిపెట్టడం"

"..............."

"తప్పదు. నిన్ను గంగలో దింపినవాడు వాడూనూ. పైగా, పెద్దాపిన్నా తారతమ్యం తెలవడం లేదు వాడికి, శిక్ష కావాలి"

"... మరి కోటమ్మ మాట?"

"వెర్రివాడా, సుబ్బలక్ష్మి మనోవర్తి యివ్వనందా?"

"రెండు లకారాల ఆస్తికదా, సగం వాటా రావలసిన మనిషికి ముష్టిమూడు వందలా సంవత్సరానికి?"

"సెలగో సెలగ"

"మీరుకూడా అలా అంటే—"

"అయితే, వొక్కటి ఆలోచించు"

"ఏమిటి?"

"చెన్నపట్నం చూడకుండా కోటమ్మకి దమ్మిడీరానిస్తాడా రామభద్రుడు?"

"రానివ్వ రన్నమాటే"

"అంతవరకూ పెట్టుపడి?"

"నేనే పెట్టాలి"

"ఏమాత్రం?"

"వేలమీదకి పాకుతుంది. తిప్పట కూడా—"

"పైగా సీవ్యవహారాలు—"

"..............."

"మాట్టాడవేం?"

"..............."

"అర్థం అయినా అయిందా?"

"అయ్యిం దయింది"

"కాలేదు"

"ఇంకా వుందా?"

"ఉన్నదే అసలు. ఇదివరకి చెప్పింది వడ్డీ మాత్రమే"

"అదేమిటో సెలవిప్పించండి"

"అతగాడు సంయే అన్నాడంటే నిన్ను నట్టేట్లో విడిచిపెట్టి, కోటమ్మ అతన్ని అలుముకుంటుంది"

"అంతపనే?"

"నిన్ను వరించిందనుకుంటున్నావు అది"

"కాకేం?"

"వెర్రినాయనా!"

"ఏం జరిగిందో చెప్పండి"

"మొదట అతగాణ్ణే ఆశ్రయించింది కోటమ్మ"

"ఊహూ"

"అది తెలిసి సుబ్బలక్ష్మి తాళాలు కూడా అతనిచేతిలో పెట్టింది"

"................"

"ఇప్పుడు తెలిసిందా, చివుకుల రామిగాడు సలహాదారో దగాఖోరో నన్నూ?"

"మతిపోతోంది నాకు"

"తప్పా?"

"................"

"వెర్రినాయనా! నువ్వొకటీ నాకొడుకు కొకటీనా నాకు? నువ్వు కాళ్ళు పట్టుకోవాలా నన్ను?"

"మీపాదాలు విడిచిపెట్టడంవల్లనే నాకీ గతి"

"నువ్వు కృతఘ్నుడవు కావన్నమాటే. మరి నామాట వింటావా?"

"ఇక అగ్గిలో దూకమంటే—"

"అది రామిగాడు చేసేపని. నాచేతులారా నేను నిన్ను పెద్దవాణ్ణి చేశాను"

"ఏమి సెలవు?"

"ఇక నువ్వు చెయ్యవలసిందల్లా వొక్కటే. అది, యిలాగే, మాట్లాడకుండా రామభద్రచయనులు పాదాలు పట్టడం"

"ఈక్షణంలో పడతాను"

"దానికి ఫలితాలేమిటో వివరంగా చెప్పనా?"

"సెలవివ్వండి"

"వెంకటేశం బాకీ వుత్తరక్షణంలో వసూలు కావడం"

"చిత్రం"

"తక్కిన నీ ఋణస్థులు మునపటిలాగే నీకు లొంగివుండడం"

"చిత్రం"

"నీ రెండో కొడుకుని సుబ్బలక్ష్మి దత్తత చేసుకోవడం"

"ఆ!"

"నా మనమరాలిని చేసుకోవాలని వుబలాటపడుతోందది. దానికి తగ్గ పిల్లాడికోసం చూస్తున్నాము. నీకొడుకుమాట నేనే చెప్పగా, కోటమ్మ దావా చెయ్యకపూర్వం రామభద్రచయనులు కూడా చాలా బలపరిచాడు"

"ఆ, ఆ"

"పోరి నాపేరు పెట్టించింది నీ రెండో కొడుక్కి మీ అమ్మ. చచ్చిపోయే టప్పుడు వాణ్ణి నాచేతుల్లో వుంచి——"

"ఎరుగుదును, మరిచిపోలేదు"

"సరిగా, యివాళకి పదిహేను రోజులుంది, మాఘశుద్ధ విదియ. ఆవేళ నీ రెండో కొడుకుకు దత్తత. వెంటనే ఉపనయనం. పంచశిఖలతోటే వాడికీ మా గున్నమ్మకి వివాహం"

"చిత్రం, చిత్రం"

"రామభద్రచయనులి రెండో కూతుర్ని నీపెద్దకొడుక్కి——"

"అదీ మాట. ఆయన ఆసరా కూడా నాకు బంధుభావంతో వుండడం చాలా అవసరం"

"ఇక కోటమ్మ మాట"

"మీరు క్షమించాలి

"ఊర్వశి అది. దాన్ని విడిచిపెట్టలేవు నువ్వు. అంతే కాదూ?"

"..............."

"ఇంత బహిరంగవ్యవహారానికి సిగ్గెందుకు రా? మరి దాని వ్యవహారం కూడా విను"

"చిత్రం"

"దావా తీసేసుకున్న వుత్తరక్షణంలో దానికి మూడువందల మనోవర్తికి ఖరారునామా పుట్టడం, గతం వెయ్యిరూపాయలు కోరింది గాని అది, రెండువేలు రొఖ్ఖం నుంచున్నపాళంగా చేతిలో పొయ్యడం. యావజ్జీవమూ వుండడానికి నీయింటి పక్కన వున్న చిన్నమేడ స్వాధీనపరచడం"

"అరొధి"

"నే నింకోటి కూడా ఆలోచించాను. అందుకు సుబ్బలక్ష్మి వొప్పుకుంది. రామభద్రుడు కూడా బాగుం దన్నాడు"

"సెల విప్పించండి"

"నీకూతుళ్ళలో తన యిష్టంవచ్చినదాన్ని కోటమ్మ దగ్గిరికి తీసుకోవడం"

"సెబాస్"

"అలా జరిగితే, దానికి పెళ్ళీ, పెట్టుపోతలూ తన దర్జాకి తగ్గట్టు సుబ్బలక్ష్మి కొనసాగించడం. వివాహసమయంలో ఆ మేడ నీకూతురిపేర రాసెయ్యడం"

"....నాకు మాట రావడం లేదు"

"వెర్రినాయన! ఇష్టమో కాదో చెప్పు"

"ఇష్టం, ఇష్టం, ఇష్టం"

"అయితే, మరి రామభద్రుడితో మాట్టాడి రానా?

"ఆవశ్యమూనూ"

"అయితే చివుకుల రామిగాడి నోటు తీసుకురా"

"....ఇదిగో తెస్తున్నాను ..."

"నుంచో"

"ఏం సెలవు?"

"కోటమ్మ నిన్నే నమ్ముకుని వుండేటట్టు చెయ్యడం రామభద్రుడి పూచీ"

"చిత్తం, చిత్తం"

"పైగా, రామిగాడి నోటుమీద సగం వడ్డీతో అస లంతా యిచ్చేస్తా దతగాడు"

"వడ్డీ యివ్వకపోయినా నాకిష్టమే"

"అలా కాదులే"

"మరి వెళ్ళి వస్తా"

"శుభం"

## 7

"ఏమన్నాడు?"

"లక్ష అన్నాడు; కాని ఫలితం గుండుసున్నా"

"వివరాలు చెప్పు"

"ప్రయోజనం?....కొంత ధర్మవాదం చేశాను. కొన్ని అసందర్భాలు చూపించాను. చివరికి భయ పెట్టాను"

"ఏమని?"

"దావా పడితే నష్టం అనీ, అప్రతిష్ఠ అనీ—"

"దానిమీద?"

"ఎప్పటిమాటే. అది నా పెళ్ళాం కాదు. దాన్ని నేను కోరలేదు. నాకేమీ తెలవని వయస్సులో నన్నడక్కుండా చేసిన పెళ్ళికి నేను బాధ్యుణ్ణి కాను—"

"వాణ్ణి అడిగే కన్నదా తల్లి?"

"..............."

"పో! బాధ్యు లెవరుట?"

"తన తల్లీ తండ్రీనిట. ఇవతల మీరుట"

"ఊహూ!"

"మీఅమ్మాయి క్కూడా తనకున్న అధికారమే వుందిట. అది కూడా నిస్సందేహంగా మళ్ళీ పెళ్ళి—"

"వాడికి ఘటాశ్రాద్ధం చేసేనా?"

"..............."

"మంచి పండితు డవుతా డని యింగ్లండు పంపిస్తే పశువై వచ్చాడు?"

"ఇంకోటి కూడా—తనకోసం మీ రెంత ఖర్చు పెట్టారో అంతకీ ప్రస్తుతం నోటు రాసి యిస్తాడుట. తరువాత—రెండేళ్ళలో—అణా పైసలతో తీర్చేస్తాడుట"

"అలా గేం?"

"ఎంతసేపూ ప్రేమ ప్రేమ—మరోమాట లేదు. ప్రేమ కలగందే పెళ్ళేమి టంటాడు. వధూవరు లిష్టపడి పెళ్ళి చేసుకోవాలి; గాని, మధ్యా మీ రంతా యెవ రన్నాడు"

"పోనీ, వొక పని చెయ్య మనలేకపోయావా?"

"ఏమిటదీ?"

"మాపిల్లతో స్నేహం చెయ్యమను. త నిక్కడికి వచ్చినా సంతోషమే, దాన్ని తన యింటికి తీసుకువెళ్ళినా సంతోషమే, మాకేమీ అభ్యంతరం లేదు. ప్రేమ కుదురుతుందా యేలుకోవచ్చు. అవసరం అయితే, తన యిష్టం వచ్చిన పద్ధతిలో మళ్ళీ పెళ్ళిచేసుకోవచ్చు. ప్రేమ కుదరదూ? మాపిల్ల మాయింటోనే వుండిపోతుంది, మే మేవిధమైన తగువూ పెట్టం. అదీ మేమూ మాకర్మానికి—"

"ఇంత ఆలోచన తోచలేదు; కాని మరో విధంగా చెప్పాను"

"ఏమని?"

"దాన్ని రహస్యంగా మాయింటికి తీసుకు వస్తూ వుంటాను, మీరిద్దరూ మాట్లాడుకుంటూ వుండండి, నచ్చి నీకు దానిమీద ప్రేమ కుదిరితే—"

"ఏమంటాడు?"

"చదువురాని మూడురాలితో స్నేహం యేమిటిట"

"తన చదువు ఇలా యేడిసింది"

''నీకూతుర్ని, వాడు, ఇటీవల చూడలేదుట. అది అందంగానే వుండ వచ్చుట. కనక దాన్ని తన యింటో అట్టేపెట్టుకుంటే—నెలో రెణ్ణెల్లో చూశా టప్పటికి తన మనస్సు చలించవచ్చుట. దానిమీద తనకి మోహం కలగ వచ్చుట. అది పెరిగిపోయి అసాధ్యం కూడా అయిపోవచ్చుట. తన శీలం చెడిపోవచ్చుట—"

''శీలం—"

''అవును. అది లేనిమనిషి మనిషి కాడుట. దాంతో ఆ జంజాటంలో కొన్ని సంవత్సరాలు పడివుండిపోవలసివస్తుంది. అక్రమ సంతానం—''

''శ్రీహరీ''

''అవును. కలగవచ్చుట. ఇటు యీమూఢురాలు వదలకపోవడమూ, అటు ఆ దుష్టసంతానంవల్ల చిక్కులు రావడమూ తటస్థించవచ్చుట. ఈ సంఘర్షణవల్ల తన కిక పెళ్ళి కాదుట. యావజ్జీవమూ యీమూఢురాలితో— తనకి సుఖం లేకుండా—ఆనందం లేకుండా—తృప్తి లేకుండా—చివరి కొక్కమాట అన్నాడు''

''ఏమిటదీ?"

''తన అమూల్యజీవితం దుఃఖభాజన మయిపో...ంటుట''

"అసలు, తన జీవితానికి విలవ అంటూ యేడిస్తేనా?''

''అదేలే, భావకవిత్వం ప్రకారం చూస్తే వాడన్నమాటకి అర్థం అదే కాదూ?"

''ఏమయితే యేం? ఈతప్పంతా నాది''

''...............''

''చిన్నతనంలో చురుగ్గా వుండడం చూసి నేనే యింగ్లీషులో ప్రవేశ పెట్టించాను. చదువు అంటడం చూసి ఆస్తి తక్కువయినా పిల్లనిచ్చాను. ప్రొఫెసర్లంతా ప్రతిభావంతుడని పొగడితే యింగ్లాండు పంపించాను. చివరికి సొమ్మూ పోయి దిమ్మూ పట్టింది''

"అలాగే అయింది"

"నేను చేసిందానికి శిక్ష కూడా నాకే అయితే బాగుండిపోవును"

"......... ........"

"మాపిల్లని చూస్తే కడుపు తరుక్కుపోతోంది"

"పైవాళ్ళమే చూడలేకుండా వుంటే—"

"ఇంకోటి చూడూ. ప్రేమ ప్రేమ అంటూ గుంజుకుంటాడు గదా, ప్రేమ వున్నవాడు ఇంత నల్లరాయి అవుతాడా?"

"నిజమే"

"కనక, నిజంగా, వాడు ఆర్ద్రహృదయుడు కాడు. వాడికి ప్రేమించడం తెలవదు. ఎవర్తిమీదో కన్నువేశాడు. అది వీణ్ణి లక్ష్యపెట్టకుండా వుంది. దాన్ని మరిచిపోలేడు, దీన్ని చేరనివ్వడు. ఇలాంటివాళ్ళకి చివరి కెలాంటి గతి పడుతుందో—"

"ఆశ్చర్యమా?"

"ఇటు చూస్తే బ్రాహ్మణలక్షణమా లేదు. అటు చూస్తే ప్రేమికుని లక్షణమా లేదు. అసలు, మనిషి లక్షణమే—"

"అలా చెప్పు, సరిపోతుంది"

"సరిపోయి? పర్యవసానం?"

"అది సరే....ఏతావతా: ఇంగ్లీషు మన గొంతు కోసింది"

"అది తెలివితక్కువ మాట. ఆచారోల్లోనూ, నడతలోనూ, భేదం కలిగించవచ్చు. ధర్మంలోనూ నీతిలోనూ కొత్తదారి తొక్కించవచ్చు. హిందువుగా పుట్టినవాణ్ణి క్రిష్టియనుగా మార్చవచ్చు; కాని పెళ్ళాం అనీ, బిడ్డలనీ, సంసారమనీ తెలవకుండా చేస్తుందా నిజమైన యింగ్లీషు?"

"ఏమో, నాకు మాత్రం—"

"అలా కాదు. అయితే, వొక తెలివితక్కువ పనిమాత్రం చేస్తున్నాము మనము"

"ఏమిటదీ?"

"మొగపిల్లల్నే కాని ఆడపిల్లల్ని యింగ్లీషులో ప్రవేశపెట్టడంలేదు మనము"

"అది మరీ—"

"విను మరి. ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళకి ఆడాళ్ళు కూడా చదువుకోవాలని వుంటుంది. ఆడాళ్ళు కూడా తమ లాగే యింగ్లీషు చదువుకుని కట్టు బొట్టు జుట్టులలో పూర్తిగా మార్పుతెచ్చుపని, కాఫీహొటళ్ళకి వెళ్ళడమూ, సిగరెట్లు తాగడమూ, టెన్నిస్ ఆడడమూ, వాళ్ళ లుంగీలకి సరిపోయేటట్టు లంగాలు కట్టి స్వేచ్ఛగా తిరుగుతూ వుండడమూ చేస్తే యీ మొగ విద్వాంసులు;

తరవాత విడాకులు తప్పకపోయినా ముందు కట్నాలూ కానుకలూ అక్కర్లే కుండా పెళ్ళిచేసుకుంటారు"

"మరి మొగపిల్లల చదువుకే మన కొంపలు గుల్లలు—"

"సగంసగమే గుల్ల లవుతున్నాయి. ఆడపిల్లల చదువుతో పూర్తిగా గుల్ల లయి—దాంతో మొగాళ్ళకి ముందు ఆటకట్టి—"

"వాదానికి బాగానే వుంది"

"నడతకి మాత్రం యెందుకు బాగుండదూ? ఇంగ్లీషు చదవడం వల్ల మొగాళ్ళకి పడమటి చూపు ఏర్పడుతోంది. మన చదువులవల్ల తూర్పుచూపూ, అసలే చదవని చోట గుడ్డితనమూ యేర్పడి ఆడపిల్లలు వాళ్ళకి సరిపోకుండా వున్నారు"

''ఆడవాళ్ళకి కూడా యింగ్లీషు అలవాటు చేస్తే మన సంప్రదాయం వొక్కటీ—''

''ఇప్పుడు మహా నిలిచివుందా? ఛాయలే కాని ఆ సత్తా ఆ జీవితమూ వున్నాయా?''

''ఏంచెప్పడానికీ దారి కనపడదు''

''....కానియ్యి ఇంకా ఎంత కాలం యేడవాలో మేము. ఒక్కపిల్ల. వజ్రపుతునక. ఎన్ని ముచ్చట్లు తీర్చుకోవా లని ఆశపడ్డాముర దానిమూలానా. ఎంత విఘాతం—''

''అదేమిట్రా?''

''................''

''ఛా, ఆడదానిలాగ—''

"ఏం, ఆడదానికే గాని మొగాడికి దుఃఖం వుండదూ? పదిహేడేళ్ళు వెళ్ళాయి, దాన్ని చూస్తూ యెలాగా భరించడం? దానికేమిటీ గతీ? పురిట్లో వొకనాడు ఆశ వదులుకున్నాం, అప్పుడే పోయి వుంటే యీకోత లేకపోవును మాకు. ఒక్కొక్కప్పుడు దాన్ని కిరస్తానీలలో కలిపేసి—మేం కూడా కలిసి పోయి మరొకడికి పెళ్ళి చేసేద్దామా అన్నంత వుద్వేగం పుడుతూ వుంటుంది నాకు. మళ్ళీ వీడెప్పటికేనా దారికి రాకపోతాడా అని ఆశ కలుగుతూ వుంటుంది"

"నాకు నమ్మకం లేదు సుమా"

"చూడూ. ఇంత వూరుంది. పైగా, నూరిళ్ళ బ్రాహ్మణాగ్రహారం. అంతా పండితుల్లోనే జమ అంతా కర్మిష్ఠుల్లోనే లెక్క. మాట్లాడితే ప్రాయశ్చిత్తా లంటారు; కాని వాడికి గడ్డి పెట్టరేం? మాపిల్లకి మళ్ళీ పెళ్ళి చేస్తే—"

''ఇంకా తరవాయేः అవి కారికలు కావు, అవి సభలు కావు, అవి బెదరింపులు కావు, అవి బహిష్కారాలుకావు—''

''ఛీ, ఏం జాతిరా మనదీः''

## 8

ఔటులై నిది బ్రాహ్మణాగ్రహారమునకు;
వివిధప్రవృత్తుల వివిధగతుల
ఛాయలే గాని అసత్యము ల్లేవిందుః
పెంచను లేదు, కుదించలేదు;
వాఆత్మవృత్తముజ్మ యాదర్శమునయందు,
తన రూపు మించుటద్దమున తోచు
న ట్లవగాహన మ్మగుచునంచు కూర్చితి
భిన్నస్థలమ్ముల వృత్త మొకట.

★ ★ ★